క్లుప్తంగా

రేషన్ సక్రమంగా అందించాలి



గ్రామ సభలో వివరాలను వెల్లడిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: నరసన్నపేట మేజరు పంచాయతీలో రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ వార్డు సభ్యులు బీఎల్ శర్మ, తదితరులు పలువురు విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. రేషన్ వాహనాలు వీధుల్లోని శివారు ప్రాంతంలో ఉంచడం వల్ల కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారని పలువురు సభ్యులు సభదృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామని సర్పంచ్ బూరల్లి శంకర్ హామీ ఇచ్చారు. పంచాయతీ జమా, ఖర్చులను ఈఓ సింహాద్రినాయుడు చదివి వినిపించారు. పంచాయతీ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, అందరూ సమయపాలన పాటించాలని వార్డు సభ్యుడు గుప్త అన్నారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికను వినిపించారు. గ్రామ సభలో ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఈఓపీఆర్డీ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌కు హెచ్‌ఎం ఎంపిక



కేశవరావు

హిరమండలం: ఈ నెల 4, 5వ తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో నిర్వహించనున్న జాతీయ సెమినార్‌కు ఎంపికైనట్లు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తులగాపు కేశవరావు మంగళవారం తెలిపారు. ఈ సెమినార్‌లో జాతీయ విద్యా విధానం 2020 అమలుపై ప్రెజెంటేషన్ ఇస్తానన్నారు. ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీ విద్యా విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నట్లు తెలిపారు. సెమినార్‌కు హెచ్‌ఎం కేశవరావు ఎంపిక కావడం పట్ల ఎంఈఓలు రాంబాబు, షణ్ముఖరావుతోపాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

రహదారి పనులు పరిశీలన



రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ చంద్రశేఖర్

పొందూరు: మండలంలోని కావలి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తాడివలస వయా ముస్సీపేట రోడ్డుకు ఏఐఐబీ నిధులు రూ.2.30 కోట్లు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో నిధులు మంజూరయ్యాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ సత్యప్రసాద్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను డీఈ చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని మిరియాపల్లి సర్పంచ్ కోడి సుధారాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లుకలాపు సుధీర్ అన్నారు. మిరియాపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టేందుకు ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభను మంగళవారం నిర్వహించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి వంద రోజుల పని కల్పించేందుకు లక్ష్యంగా తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ, ఉపాధి సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఉపయోగపడే పనులు చేయాలి

సరుబుజ్జిలి: ప్రజలందరికీ ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వి.శివానందమూర్తి అన్నారు. మండలంలోని సింధువాడ సచివాలయంలో మంగళవారం ఉపాధి హామీ ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై శిక్షణ

పొందూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో 2024–25లో ఉపాధి వేతనదారుల కోసం పనుల గుర్తింపు ప్రణాళికపై ఎంపీడీఓ కార్యాలయంలో పొందూరు, ఎచ్చెర్ల, ఆమదాలవలస ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేశ్వరరావు, ఎంపీడీఓ సీపాన హరిహరరావు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఉపాధి పనులను తక్షణమే గుర్తించాలని సూచించారు. 100 రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు తిమడాంలో గడపగడపకు మన ప్రభుత్వం

జలుమూరు: తిమడాంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం ఉదయం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ వాన గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.



మెళియాపుట్టి: కొసమాలలో వైద్యుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బూర్జ: పాలవలసలో రోగులకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు



ఆమదాలవలస రూరల్: కలివరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



నరసన్నపేట: సత్యవరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ప్రజలకు ఆరోగ్య భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

-సాక్షి నెట్‌వర్క్

గ్రామంలోనే వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మా సచివాలయంలో ఏర్పాటు చేయడం అభినందనీయం. వైద్యులే గ్రామానికే వచ్చి పరీక్షలు నిర్వహించారు. నేను కంటి బాధ, నడునొప్పితో గతకొద్ది రోజులుగా బాధపడుతున్నాను. వైద్య శిబిరానికి వచ్చాను. వైద్యులు పరీక్షలు చేసి మందులు అందించారు.

–బృందావతి బిస్వాల్, సీతారాంపల్లి గ్రామం, పాతపట్నం మండలం



జలుమూరు: అందవరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: బూరగాంలో వైద్య సేవలపై వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సారవకోట: అద్దపనసలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన



ఎల్.ఎన్.పేట: పెద్దకొల్లివలసలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: పాలవలసలో మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: బలదలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సర్పంచ్ సారిపల్లి భారతి



హిరమండలం: గులుమూరులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పోలాకి: అంపలాంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జలుమూరు: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

జలుమూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జలుమూరు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కడా మంచి నీరు పడదని, తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ ఇప్పిలి దుర్గ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన దామోదరరావు, మాజీ సర్పంచ్ సంధ్య తీసుకువచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గడపగడపకు నిధులతో వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డోల నాగరత్నం, తంగి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షులు కనుసు సీతారాం, అల్లాడ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షులు ఎం.శ్యామలరావు పి.రాజప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దామ మన్మధరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, సోషల్ మీడియా కన్వీనర్ కరణం గణపతి తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

మౌలిక వసతులతో గ్రామాలాభివృద్ధి

జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా నాబార్డ్ నిధులు రూ.40 లక్షలతో జలుమూరులో ఇంటింటి కుళాయిలు, నాడు–నేడు నిధులు రూ.50 లక్షలతో పీహెచ్‌సీ అభివృద్ధి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యంతో పాటు ఖరీదైన మందులు అందుబాటులో ఉంచి ప్రజలకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే బీపీ పరీక్షలు చేయించుకున్నారు. వైద్యుడు తాడేల శ్రీకాంత్, మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

పాతపట్నం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనసాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని తీమర, తామర గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించారు. ఇప్పటివరకు ఆయా కుటుంబ సభ్యులు పొందిన ఆర్థిక ప్రయోజనాలను గురించి తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. రాజకీయాలతో పనిలేకుండా సంక్షేమ పథకాలను అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, రాష్ట్ర దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ మంచు చంద్రయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, వెంకటరావు, గేదెల సూర్యం, ఇప్పిలి ధనుంజరావు, ఇప్పిలి నారాయణరావు, ఎం.రామారావు, ఈఓపీఆర్డీ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి, వీఆర్వో వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: తీమరలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదర్శంగా నిలుస్తోందని చెప్పడానికి తాజా సర్వేలే నిదర్శమని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో సీఎం జగన్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు మాట్లాడారు. సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రజలందరికీ మరింత మేలు జరుగుతుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు అనంతరం టౌమ్స్ నౌ సంస్థ నిర్వహించిన సర్వేలో కూడా సీఎం జగన్ పాలనకు అధిక మార్కులు వచ్చాయన్నారు. 51 శాతం ఓట్లతో 23 ఎంపీ సీట్లు వస్తాయని ఆ సర్వేలో విశ్లేషకులు వెల్లడించారన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేసీ హెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, లుకలాపు రవి, సురంగి నర్సింగరావు, ఇప్పిలి నీలం, సీర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సరుబుజ్జిలి: ఆరోగ్యసూత్రాలు వివరిస్తున్న సూపర్‌వైజర్ రత్నాంజలి

ఆమదాలవలస రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండలంలో కలివరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తుందని, లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు.

సమీకృత ఆహారం తీసుకోవాలి

సరుబుజ్జిలి: గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ రొట్టవలస సెక్టార్‌సూపర్‌వైజర్ ఎం.రత్నాంజలి తెలిపారు. మండలంలోని పాలవలస గ్రామంలో మంగళవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పలు రకాల వంటకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు.



ఆమదాలవలస రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ వాసుదేవరావు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

హిరమండలం: వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం ప్రతినిధి గంగారపు ఈశ్వరమ్మ కోరారు. గులుమూరు పంచాయతీ శాస్త్రులపేటలో వంశధార నిర్వాసితులను మంగళవారం కలిశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంతోపాటు అదనపు ప్యాకేజీ విషయమై జిల్లా కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. దీనికి అందరూ తరలిరావాలని కోరారు.



నిర్వాసితులతో కలిసి నినాదాలు చేస్తున్న ఈశ్వరమ్మ

జీవామృతంపై తయారీపై అవగాహన

హిరమండలం: మండలంలోని భగీరథపురంలో జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. సాగులో రసాయనాల వినియోగం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయమే అత్యంత శ్రేయస్కరమన్నారు.

జిల్లేడు ద్రావణంతో వరిలో తెగుళ్ల నివారణ

ఎల్.ఎన్.పేట: జిల్లేడు ద్రావణంతో వరి పంటను ఆశించే తెగుళ్లను నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండలంలోని రావిచెంద్రి గ్రామంలో మంగళవారం జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు అవగాహన కలిగించారు. ఐదు లీటర్ల ఆవు మూత్రం, ఐదు కిలోల జిల్లేడు ఆకులు వంద లీటర్ల నీటిలో మూడు నుంచి ఐదు రోజులపాటు నీడలో మురగ బెట్టాలన్నారు. ఆ తరువాత ఈ ద్రావణం ఎకరా పొలంలో పిచికారీ చేస్తే పంటకు కావల్సిన పోటాష్‌ను అందిస్తుందన్నారు. ఈ ద్రావణం తయారు చేసి వినియోగించటం వల్ల రైతుకు సుమారు రూ.4వేలు పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు.

అగ్ని అస్త్రం తయారీపై అవగాహన

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో ఎన్‌పీఎం షాపు వద్ద అగ్ని అస్త్రం తయారీపై రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

ఇంగువ ద్రావణంతో ఎంతో మేలు

సారవకోట: ఇంగువ ద్రావణంతో వరి పంటకు మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని దాసుపురం, పురుషోత్తుకర్ర గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆవు మూత్రంతో ఇంగువ ద్రావణం తయారు చేసే విధానం, తయారీకి కావల్సిన వస్తువులను గూర్చి వివరించారు.

నేడు కొత్తూరులో జగనన్నకు చెబుదాం

కొత్తూరు: ఈ నెల 4వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.పావని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు వ్యక్తిగత, ఇతర సమస్యలు అధికారులకు వినతుల రూపంలో తెలియజేయవచ్చన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో బుధవారం ఉచితం కంటి వైద్య శిబిరాన్ని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించి, ఉచిత ఆపరేషన్లు చేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.